పంట నష్టాన్ని అంచనా వేయాలి

పాల్వంచ రూరల్, జూలై 23: వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసి అధికారులు నివేదికలు పంపాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రంగాపురం, నాగారం కాలనీల్లోని పంటలను ఆయన మంగళవారం వ్యవసాయశాఖ అధికారి శంకర్‌తో కలిసి పర్యటించారు.

అధికారులు ముంపు గ్రామాలపై దృష్టి పెట్టాలి

పినపాక, జూలై 23: భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి వరద పెరుగుతున్నందున మండల స్థాయి అధికారులంతా అందుబాటులో ఉంటూ ముంపు గ్రామాలపై దృష్టిపెట్టాలని తహసీల్దార్ సూర్యనారాయణ అన్నారు. ఆయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో వరదలపై నిర్వహించిన సమీక్షా నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆదివాసీలను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

టేకులపల్లి, జూలై 23: మహిళలకు కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రూ. 10లక్షలు ఇప్పిస్తాను అని ఒక్కొక్కరి వద్ద నుంచి 25వేలు వసూలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ మహిళలు అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పురాయి పంచాయతీ ఇప్పల చెలక గ్రామంలో బాధితులతో కలిసి ఈసం నాగలక్ష్మీ మాట్లాడారు. ఆదివాసీల మహిళలను మోసం చేసిన వ్యక్తిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ముంపు బాధితులకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి

జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అమర్‌సింగ్

రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రభాకరరావు

భద్రాచలం, జూలై 23 : గోదావరి ముంపు పరివాహక ప్రాంతాల్లోని పీహెచ్‌సీలల్లో పనిచేస్తున్న వైద్యులు స్థానికంగా ఉంటూ 24గంటలు ముంపు బాధితులకు వైద్యసేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు, గోదావరి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలోని అదనపు వైద్య శాఖాధికారి ఛాంబర్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా ముంపు ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు, వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద తాకిడికి గురయ్యే గ్రామాల్లోని గర్భిణులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వారిని ముందుగానే గుర్తించి దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీలో చేర్పించి డెలివరీ అయ్యే వరకు జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. వరద తాకిడికి గురైన గ్రామాల్లో తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమల మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, డాక్టర్ చైతన్య, డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

కంట్రోల్ రూం పనితీరు భేష్..

భద్రాచలం, జూలై 23 : పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయంలో

వైద్య ఆరోగ్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అమర్‌సింగ్

గోదావరి వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు వరద సమాచారం కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం సేవలు భేష్ అని డీఎస్పీ ప్రభాకరరావు అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో బీ రాహుల్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూం పనితీరును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంట్రోల్ రూంకు వచ్చిన ప్రతి ఫోన్ కాల్‌ను, కాల్ చేసిన వారి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారని, వారు కోరిన గోదావరి హెచ్చు తగ్గుల వివరాలు తెలుపుతున్నారన్నారు.

మండలంలో జిల్లా వైద్యాధికారుల పర్యటన

చర్ల, జూలై 23 : అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్‌నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ మంగళవారం మండలంలో పర్యటించారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజన్సీ ప్రాంతంలోని గోదావరి తీర గ్రామాల్లో పరిస్థితిని తెలుసుకునేందుకు తీరగ్రామాలను వారు సందర్శించారు. అనంతరం చర్ల(కొయ్యూరు), సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. స్థానిక వైద్య సిబ్బందిని పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఆరోగ్య శిబిరాలు, రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సీజన్‌కు సరిపడ మందులు నిల్వ ఉంచుకోవాలన్నారు. ప్రసవం తేదీలు దగ్గరపడిన గర్భిణులను వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించాలన్నారు.

మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

రామవరం, జూలై 23: రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన కలెక్టర్ ప్రతీ రోజు వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డాక్టర్ సరళ, డాక్టర్ వీరబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమిడిసిలేరు ఆశ్రమపాఠశాలను సందర్శించిన పీవో రాహుల్

విద్యార్థులతో ఐటీడీఏ పీవో రాహుల్

చర్ల, జూలై 23 : భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మంగళవారం పెద్దమిడిసిలేరు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో పరిస్థితిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల అన్ని విభాగాలను తనిఖీ చేసి మెనూ పరిశీలించారు. కొద్దిసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడిఉన్నారని, ఉపాధ్యాయులు విద్యాబోధన సరిగా లేదని ఐటీడీఏ పీవో రాహుల్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జూలై 23 : భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దివ్యక్షేత్రంలో మంగళవారం సీతారాములకు నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా జరిపారు. అనంతరం స్వామి వారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి సీతారాములకు నిత్యకల్యాణం జరిపి, కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.

నేటి నుంచి ప్రమాద రహిత వారోత్సవాలు

భద్రాచలం, జూలై 23 : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం నుంచి ప్రమాద రహిత వారోత్సవాలను బుధవారం నుంచి ఈ నెల 30వరకు నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. మంగళవారం డీఎం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా 24న ప్రముఖ వ్యక్తితో వారోత్సవాలను ప్రారంభించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొంటారని అన్నారు. అలాగే ప్రతిరోజూ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రుణమాఫీ ఫిర్యాదుల పరిష్కార విభాగం ఏర్పాటు

కొత్తగూడెం టౌన్, జూలై 23: రుణమాఫీ పథకంలో ఫిర్యాదులు ఉంటే రైతులు తమ సమీపంలోని ఏవో, ఏఈవోలను సంప్రదించాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి బాబురావు మంగళవారం తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఒక పరిష్కారం విభాగం ఏర్పాటు చేశామని, రైతులు 7288894249 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠశాలకు బెంచీలు, వాటర్ ప్యూరిఫైర్ అందజేత

టేకులపల్లి, జూలై 23: మండలం పరిధిలోని ఎర్రాయిగూడెం, బర్లగూడెం ప్రభుత్వ పాఠశాలకు సీపీ మొక్కజొన్న సీడ్స్ థాయ్‌లాండ్ వారి సహకారంతో నందిని ట్రేడర్స్ యజమాని నర్సింహారావు ఆధ్వర్యంలో ఎర్రాయిగూడెం, బర్లగూడెం పాఠశాలకు బెంచీలు, వాటర్ ప్యూరిఫైర్, స్టేషనరీ కిట్లు అందజేశారు. బెజ్జంకి రాజశేఖర్, సాగినేని నర్సింహారావు, వెంకటేశ్వర్లు, ఈసం అచ్చయ్య, పాష పాల్గొన్నారు.

ఇసుక మేటలను పరిశీలించిన మైనింగ్ అధికారులు

అశ్వారావుపేట టౌన్, జూలై 23: పెదవాగు ప్రాజెక్టు వరద ముంపు కారణంగా పంటపొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలను మంగళవారం జిల్లా మైనింగ్ అధికారులు స్థావెక రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ పోలాల్లోని ఇసుక మేట్లను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఆర్టికల్చర్ హెచ్‌వో వేణుగోపాల్, వ్యవసాయశాఖ అధికారులు ఏఈవోలు ఆరేపల్లి సతీష్, షాకీరాబాను, రవీంద్ర తదితరులు ఉన్నారు.

వీవోఏలకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

దమ్మపేట, జూలై 23: వీవోఏ (గ్రామ దీపికలు)లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్జున్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ క్యాంపు కార్యాలయంలో వీవోఏల సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.

కిన్నెరసాని నుంచి 5వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ రూరల్, జూలై 23: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి ఐదువేల క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా, మంగళవారం ఉదయం 402.2 అడుగులు ఉంది. ఇన్‌ఫ్లో 4 వేల క్యూసెక్కులు ఉండడంతో అధికారులు ఒక గేటు ద్వారా 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు

కొత్తగూడెం టౌన్, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకంలో అర్హులై రుణమాఫీ అయిన రైతులు సహకార సంఘంలో కొత్త రుణాలు తీసుకోవాలని సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు అన్నారు. కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల్లోని రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

జూలూరుపాడు, జూలై 23: రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సాయిరాంతండా–జూలూరుపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం బారికేట్లు ఏర్పాటు చేశారు.

మునగ పంట ద్వారా అధిక లాభాలు

ఆదనపు కలెక్టర్ విద్యాచందన

మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్

పాల్వంచ రూరల్, జూలై 23: రైతులు తమ పొలాల్లో మునగ పంట వేసుకుని తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందవచ్చునని ఆదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. మండలంలోని బిక్కుతండాలో గుగులోతు ధ్వాని పొలంలో నాటుతున్న మునగ ప్లాంటేషన్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం నాగారంలోని డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న మీసేవ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎంపీవో నారాయణ, ఏవో శంకర్, హార్టికల్చర్ సూపర్ వైజర్‌రాజు, ఏపీవో రంగా, ఏపీఎం రాంబాబు, కార్యదర్శి సౌజన్య, సిబ్బంది రజిత, నాగేశ్వరావు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదారమ్మ

బూర్గంపాడు, జూలై 23: గోదావరి వరద మంగళవారం సాయంత్రం నుంచి తగ్గుతూ వస్తుంది. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎస్సై రాజేష్ ముంపు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం నుంచి స్వల్పంగా తగ్గుతూ రావడంతో అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముంపు ప్రాంత ప్రజలు అధికారులకు సహకరించాలి

బూర్గంపాడు, జూలై 23: మండలంలోని లోతట్టు ప్రాంతాలకు వరదనీరు చేరడంతో వరద ప్రాంతాల్లో భద్రాచలం ఆర్డీవో దామోదర్ పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ముంపు ప్రాంత ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

శాశ్వత పరిష్కారం చూపండి

బూర్గంపాడు, జూలై 23: గోదావరి వరదల ముంపు బాధిత గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముజాహిద్‌కు వినతిపత్రం అందజేశారు.

పురుగు మందుతాగి వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, జూలై 23: పురుగు మందుతాగి కల్తీ నర్సింహారావు (45) మృతిచెందిన ఘటన మండలంలోని చంద్రాలగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకునే నర్సింహారావు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు కావాలని సోమవారం భార్య నర్సమ్మను అడిగాడు. ఆమె ఇవ్వలేదు. మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే అనర్థం

- పెదవాగు వరద బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలి
- అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు
- ముంపు బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట టౌన్, జూలై 23 : ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యంతోనే పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోయి అపార నష్టం వాటిల్లిందని, వరద ముంపుతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ముంపు గ్రామమైన గుమ్మడివల్లి గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన పెదవాగు వరదతో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలను ఇంటింటికి తిరిగి ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్తులు తెలపడంతో వెంటనే ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. అక్కడే ఉన్న ఎంపీవో సీతారామరాజుకు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం రామాలయం వద్ద బాధిత కుటుంబాలతో మాట్లాడుతూ పెదవాగు వరదతో నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని అభయమిచ్చారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ఉంటే ఇంత అనర్థం జరిగి ఉండేది కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు పర్యటనలు మాని బాధితులకు న్యాయం చేయాలని హితవుపలికారు. అనంతరం కొత్తూరులో విద్యుదాఘాతంతో మృతిచెందిన వేణు మురళీకృష్ణ కుటుంబంతోపాటు మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పార్టీ మండల కార్యదర్శి జుజ్జూరి వెంకన్నబాబు, పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ జూపల్లి రమణారావు, నాయకులు తాడేపల్లి రవి, కాసాని చంద్రమోహన్, యార్లగడ్డ శ్రీను, బుచ్చిబాబు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చంద్రుగొండ, జూలై 23: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో అశోక్ అన్నారు. మంగళవారం తిప్పనపల్లి గ్రామంలో డ్రైడే కార్యక్రమంలో ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట జీపీ సెక్రటరీ శివ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలోనే మంచి ఆరోగ్యం : మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ

గుర్రంగూడెం గ్రామంలో మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ పర్యటించారు. గ్రామస్తులు ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే మంచి ఆరోగ్యం ఉంటుందని తెలిపారు.

గుర్రంగూడెంలో ఇండ్లను పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ

పరిశుభ్రత తప్పనిసరి..

చుంచుపల్లి, జూలై 23: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చుంచుపల్లి ఎంపీడీవో అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన వెంట ఎంపీవో గుంటి సత్యనారాయణ, ఈజీఎస్ ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అన్నపురెడ్డిపల్లి, జూలై 23: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ

అశ్వారావుపేట రూరల్, జూలై 23: పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగడంతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు మంగళవారం రెవెన్యూ అధికారులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో 70 కుటుంబాలకు పరుకులు పంపిణీ చేశారు. సిబ్బంది ఎస్ శ్రీశైలం, ఎం రమేష్ తదితరులు ఉన్నారు.

నిత్యావసరాల అందజేత..

అశ్వారావుపేట రూరల్, జూలై 23: పెదవాగు ప్రాజెక్టుకు గండి పడడంతో ఆంధ్రప్రదేశ్‌లోని వెలేరుపాడు మండలం, కమ్మరిగూడెం గ్రామంలో సుమారు 250 మంది నిర్వాసితులయ్యారు. మంగళవారం పలువురు ఉపాధ్యాయులు వారికి అండగా నిలుస్తూ నిత్యావసర సరుకులు అందజేశారు. ఎంఈవో జగన్మోహనరావు, హరిబాబు, రవిబాబు, కృష్ణారావు, సిద్దు, వెంకటేశ్వరావు, సున్నం నాగేశ్వరావు, వెంకటేష్, నాగలక్ష్మీ, రోజా, కుమారి, కమల, నోబుల్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కొత్తగూడెం అర్బన్, జూలై 23: ప్రస్తుత సమాజంలో మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని, మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి సాహితి అన్నారు. 26వ వార్డులో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, శేషకుమారి, లావణ్య, ఆర్పీలు లలిత, ఝాన్సీరాణి, వార్డు కౌన్సిలర్ అంబుల వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోళ్ళపాడు ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వాలి

టేకులపల్లి, జూలై 23: రోళ్ళపాడు ప్రాజెక్టుకు సీతారామ నీళ్లు వచ్చేంతవరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటం చేసామని బేతంపూడి సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు రోళ్లపాడు ప్రాజెక్టులో పడే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

టీవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన

కొత్తగూడెం అర్బన్, జూలై 23: దివ్యాంగులను కించపరిచే విధంగా పోస్టు పెట్టిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీస్ అన్నారు. టీవీపీఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. రమేష్‌కుమార్ మక్కడ్, జోగారావు, కాటి నాగేశ్వరరావు, ఖాదర్‌బాబా, మేడి ప్రవీణ్, శైలజ, కళాబాబు రెడ్డి, సురేష్, సాయిబాబా, శ్రీను, గట్ల రమేష్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

జూలూరుపాడు, జూలై 23: మండలంలోని పడమట నర్సాపురం గ్రామానికి చెందిన లేళ్ల అప్పిరెడ్డి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో పెట్టి ఇంట్లో నిద్రించాడు. ఉదయం లేచి చూడగా బైక్ మాయమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందుతాగి విద్యార్థి ఆత్మహత్య

గుండాల, జూలై 23 : పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందనే భయంతో ఓ విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అజ్మీరా వీరు, అరుణ దంపతుల కుమారుడు సుధీర్(10) తమ గ్రామంలో 5వ తరగతి వరకు చదివాడు. 6వ తరగతిలో కోసం గుండాల గురుకుల పాఠశాలలో చేర్పించారు. అయితే గురుకుల పాఠశాలలో ఉండనని చెప్పి తల్లిదండ్రులకు కబురు పంపించి సోమవారం ఇంటికి వచ్చిన సుధీర్ మళ్లీ పాఠశాలకు వెళ్లనని మారాం చేశాడు. దీంతో పాఠశాలకు వెళ్లకున్నా పరవాలేదు.. ఇంటి దగ్గరే ఉండి చదువుకొమ్మని తల్లిదండ్రులు నచ్చజెప్పారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తల్లిదండ్రులు చేను పనికి వెళ్లగా.. ఎలాగైనా తనను పాఠశాలకు పంపిస్తారనే భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యుల సహాయంతో గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుధీర్ మృతిచెందాడు. ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల అప్రమత్తతతో గండి పూడ్చివేత

ఆళ్ళపల్లి, జూలై 23: మండల పరిధిలోని మర్కోడు పంచాయతీ సుద్దరేవు గ్రామం కొత్తచెరువుకు గండి పడడంతో రైతులు గమనించి వెంటనే ఇరిగేషన్ ఏఈ దుర్గాప్రసాద్‌కు తెలిపారు. స్పందించిన ఏఈ, డీఈ నాగమల్లేశ్వరరావుతో రైతుల సహకారంతో గండిని పూడ్చివేశారు.

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలు అందజేత

ఇల్లెందు రూరల్, జూలై 23: ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలు అందజేశామని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2022 సంవత్సరం వరకు తమ సీఎంపీఎఫ్ ఖాతా నందు జమ అయిన డబ్బులకు సంబంధించి సీఎంపీఎఫ్ పాసు పుస్తకాలను కార్మికులకు అందజేశామన్నారు.

రాయల చంద్రశేఖర్ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

ఇల్లెందు రూరల్, జూలై 23: రాయల చంద్రశేఖర్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మంగళవారం చండ్ర కృష్ణమూర్తి ట్రస్టు భవన్‌లో చంద్రశేఖర్ సంతాప సభలో ఆయన మాట్లాడారు. రాయల చంద్రశేఖర్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఆదర్శనీయుడు రాయల చంద్రశేఖర్

దమ్మపేట, జూలై 23: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జాతీయ నాయకుడు రాయల చంద్రశేఖర్ ఆదర్శనీ